# కొనసాగుతున్న ఫార్మా ఫెన్సింగ్ పనులు

**రైతులను రానీయకుండా భారీగా పోలీసుల బందోబస్తు**

యాచారం, ఏప్రిల్ 10: రంగారెడ్డి జిల్లా యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తిలో ఫార్మాసిటీ ఏర్పాటు కోసం గతంలో సేకరించిన భూముల ఫెన్సింగ్ పనులు గురువారం భారీ పోలీసు బందోబస్తు నడుమ చేపట్టారు. మహేశ్వరం అదనపు డీసీపీ వెంకటసత్యనారాయణ, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, ఫార్మాసిటీ పీఎస్ సీఐ కృష్ణంరాజు సమక్షంలో రెవెన్యూ, టీజీఐఐసీ అధికారులతో కలిసి తహసీల్దార్ అయ్యప్ప, ఆర్ఐలు మురళీ కృష్ణ, రామకృష్ణ ఫార్మా భూముల సర్వే కొనసాగిస్తున్నారు. సర్వే చేసిన భూములకు జేసీబీలు, కూలీలతో కందకాలు తీసి వెంటవెంటనే హద్దులను గుర్తించి, ఐరన్ పిల్లర్లు పాతి, ఫెన్సింగ్ చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు సర్వే పనుల వద్దకు రైతులు, గ్రామస్తులు, ఆందోళనకారులు రాకుండా భద్రతను ఏర్పాటుచేశారు. 8మంది సీఐలు, 15 మంది ఎస్సైల ఆధ్వర్యంలో 150 మంది సివిల్, స్పెషల్ పోలీసులతో పటిష్టమైన భద్రత ఏర్పాటు నడుమ ఫెన్సింగ్ పనులను కొనసాగిస్తున్నారు. ఇప్పటి వరకు 150కిలో మీటర్ల మేరకు సర్వే చేసి ఫెన్సింగ్ చేపట్టినట్టు రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు.



పోలీసుల బందోబస్తుతో ఫెన్సింగ్ పనులు చేపడుతున్న అధికారులు

# పంట భూములను లాక్కోవద్దు సారూ..

- ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ పోలెపల్లి రైతుల నిరసన
- జేసీబీలు, బుల్డోజర్లను అడ్డుకొని ధర్నాకు దిగిన రైతులు

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 10 : 50 ఏండ్లకు పైబడి సాగు చేసుకుంటున్న తమ పంట భూములను లాక్కోవద్దని రైతులు ప్రభుత్వాన్ని వేడుకున్నారు. అధికారులు పోలీసుల సహకారంతో జేసీబీలు, బుల్డోజర్లతో చేరుకోగా రైతులు అడ్డుకొని ధర్నాకు దిగిన ఘటన ఖమ్మం జిల్లా రూరల్ మండలం పోలెపల్లిలో గురువారం చోటుచేసుకుంది. పోలెపల్లి సమీపంలోని మున్నేరు వాగు రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టిన భూముల్లో ఉదయం 10 గంటల నుంచి టెంట్లు వేసుకుని వందమంది రైతులు నిరసన చేపట్టారు. తాము సాగు చేసుకుంటున్న భూములను లాక్కోవద్దని అధికారులను కోరారు. ఈ క్రమంలో అధికారులు జేసీబీలు, బుల్డోజర్లతో అక్కడికి చేరుకోవడంతో రైతులు జేసీబీలు, బుల్డోజర్లను అడ్డుకున్నారు. రూరల్ ఎస్సై అనిల్, పోలీస్ సిబ్బందికి రెండుచేతులు జోడించి దండంపెడుతూ తమ భూముల జోలికి రావొద్దని, ఆడపిల్లల పెళ్లిళ్లకు పసుపు, కుంకుమ కింద భూములను ఇప్పటికే రాసిచ్చామని ప్రాధేయపడ్డారు. దీంతో పోలీసులు, రైతుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నది. చివరికి రెండు రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాలని రైతులకు పోలీసులు, అధికారులు సూచించారు. తర్వాత అక్కడి నుంచి బుల్డోజర్లు, జేసీబీలు వెళ్లిపోవడంతో రైతులు శాంతించారు. రైతులకు సీపీఎం మండల కార్యదర్శి ఊరడి సుదర్శన్‌రెడ్డి మద్దతు తెలిపారు.



ఖమ్మం జిల్లా రూరల్ మండలం పోలెపల్లిలో బుల్డోజర్లను తమ భూముల్లోకి రానివ్వొద్దని ప్రాధేయపడుతున్న రైతులు

## 23 వేల ఎకరాల్లో పంటనష్టం

- తొలుత 8,408 ఎకరాలుగా నిర్ధారణ
- తాజాగా మరో 14,956 ఎకరాల్లో నష్టం
- వివరాలు వెల్లడించిన మంత్రి తుమ్మల



హైదరాబాద్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రాష్ట్ర వ్యాప్తంగా 23,364 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గతనెల కురిసిన వర్షాలకు 8,408 ఎకరాల దెబ్బతిన్నట్టు నిర్ధారణ అయిందని, బాధిత రైతులకు త్వరలోనే పరిహారం అందిస్తామని తెలిపారు. రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు 14,956 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్టు ప్రాథమిక అంచనా వేసినట్టు తెలిపారు. 'గ్రామ గ్రామానికి జయశంకర్ వ్యవసాయ వర్సిటీ నాణ్యమైన విత్తనం' అనే నూతన కార్యక్రమాన్ని జూన్ తొలివారంలో సీఎం చేతుల మీదుగా ప్రారంభించనున్నట్టు మంత్రి తెలిపారు. ఈ పథకం కింద వ్యవసాయ యూనివర్సిటీ అభివృద్ధి చేసిన నాణ్యమైన విత్తనాలను అందించనున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో మూడు నుంచి ఐదుగురు ఆసక్తి కలిగిన అభ్యుదయ రైతులకు ఈ పథకం కింద విత్తనాలను పంపిణీ చేస్తామని తెలిపారు.

## తేమ ఎక్కువుంటే ధాన్యం కొనబోం

- ఇది జాతీయ విధానం
- తేల్చిచెప్పిన మంత్రి ఉత్తమ్



హైదరాబాద్, ఏప్రిల్ 10(నమస్తే తెలంగాణ): తేమ 17శాతానికి మించి ఉంటే ధాన్యం కొనుగోలు చేసే ప్రసక్తే లేదని, ఇది జాతీయ విధానమని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి తేల్చి చెప్పారు. నిబంధనలకు అనుగుణంగా ధాన్యం తేవాల్సిందేనని స్పష్టంచేశారు. హైదరాబాద్ జలసౌధ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. యాసంగి సీజన్‌లో ధాన్యం కొనుగోలు కోసం 8,209 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కేంద్రం సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్న ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని మంత్రి కొట్టిపారేశారు. సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులందరూ భాగస్వాములై, లబ్ధిదారులతో కలిసి భోజనం చేయాలని సూచించారు.

## మరో రెండ్రోజులు వడగండ్ల వాన

**హైదరాబాద్ వాతావరణ కేంద్రం**

హైదరాబాద్, ఏప్రిల్ 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వడగండ్ల వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ తెలిపింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వర్షాలు కురుస్తున్నాయి. గురువారం కూడా పలు ప్రాంతాల్లో ఈదురుగాలులతో వడగండ్ల వాన కురిసింది. మరోవైపు రాష్ట్రంలో వాతావరణంలో భిన్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఎండ, వాన, చలి అన్నట్టుగా కలగలిసిన వాతావరణం కనిపిస్తున్నది. రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో గాలిలో తేమశాతం పెరిగి అక్కడక్కడ క్యుమిలోనిబంస్ మేఘాలు ఏర్పడుతున్నాయి. మేఘాలు చల్లబడి గాలి దుమారంతో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు జిల్లాల్లో శనివారం వరకు ఎల్లో అలెర్ట్ జారీ చేశారు.

# టెక్స్‌పోర్ట్ రెడీ!

మొదటిపేజీ తరువాయి...

సదుపాయాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పించగా, టెక్స్‌పోర్ట్ ఇండస్ట్రీస్ రూ.40 కోట్లతో యంత్రాలతో పరిశ్రమను ఏర్పాటు చేసింది. ఇక్కడ తయారయ్యే దుస్తులను 'టెక్స్‌పోర్ట్' వందశాతం ఎగుమతి చేయనున్నది.

**సమస్యలు పరిష్కారమయ్యేనా?**

సిరిసిల్ల కార్మిక క్షేత్రానికి నలుగురు మంత్రులు వస్తుండడంతో తమ బతుకులు బాగుపడుతాయన్న ఆశతో నేతన్నలు ఎదురుచూస్తున్నారు. కేసీఆర్ సర్కారు చేయూతతో నిరంతరాయంగా నడిచిన మరచక్రాలు.. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిలిచిపోయాయి. 30మంది వరకు నేతన్నలు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం స్పందించలేదన్న విమర్శలు వ్యక్తమయ్యాయి. బతుకమ్మ చీరల ఆర్డర్లు కూడా లేకపోవడంతో చాలామంది ఉపాధిపై దెబ్బపడింది మంత్రుల పర్యటనలు కేవలం నామమాత్రంగానే ఉంటాయా లేక, సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మకమైన చర్యల దిశగా అడుగులు పడుతాయా అని నేతన్నలు ఎదురుచూస్తున్నారు.



సిరిసిల్ల అప్పారెల్ పార్క్‌లో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా

### ఆఫీస్ దూరమైంది



మా సమస్యలు చెప్పుకొనేందుకు ఆఫీస్ దూరమైంది. పగార తక్కువ ఇచ్చిండ్రని, త్రిఫ్ట్ పైసలు పడలేదని గిట్ల ప్రతీ సమస్యను దగ్గరున్న సార్లకు ఇన్ని రోజులు చెప్పుకొన్నం. ఉన్న ఆఫీస్ తీసుకుపోయి కలెక్టరేట్‌లో పెట్టిండ్రు. అంతదూరం వెళ్లి, సమస్యలు చెప్పుకోలేకపోతున్నం. కాంగ్రెస్ సర్కారు వస్తే బతుకులు ఇట్ల ఆగమైతయని అనుకోలేదు.

**- పండరీ, నేత కార్మికుడు**

### బ్యాక్ బిల్లింగ్ రద్దు చేయాలి



వస్త్ర పరిశ్రమకు గత ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ప్రోత్సహించింది. మరమగ్గాలకు విద్యుత్తు రాయితీలు ఇచ్చింది. క్యాటగిరి 4నుంచి క్యాటగిరి 3కు మార్చడంతో బ్యాక్ బిల్లింగ్ కట్టాలంటూ సెస్ అధికారులు ఒత్తిడి తెస్తున్నరు. కరెంట్ కట్ చేసింద్రు. అంత మొత్తం కట్టలేము. సాంచాలు అమ్ముకునే పరిస్థితి వచ్చింది. బ్యాక్ బిల్లింగ్ మొత్తానికి రద్దుచేసి యూనిట్‌కు రూ.2చొప్పున బిల్లులు వేయాలి.

**- దూస అశోక్, అసాముల సంఘం నాయకుడు**

### వర్కర్ టు ఓనర్ పథకాన్ని అమలు చేయాలి



నేతన్నల సంక్షేమాన్ని కాంక్షిస్తూ కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలన్నీ యథావిధిగా అమలు చేయాలి. కార్మికుడినే యజమానిగా మార్చాలన్న ఉద్దేశంతో ప్రవేశపెట్టిన వర్కర్ టు ఓనర్ పథకాన్ని వెంటనే అమలు చేయాలి. మహిళా సంఘాల కోసం తయారు చేస్తున్న చీరలకు కూలీ రేట్లు నిర్ణయించాలి.

**- మూషం రమేశ్, పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు**

### టెక్స్‌పోర్ట్ పరిశ్రమ విశేషాలు

| | |
|---|---|
| పరిశ్రమ ఏర్పాటుకు అయిన వ్యయం | రూ.102 కోట్లు |
| ఏటా ఎగుమతి చేసే దుస్తుల విలువ | రూ.300 కోట్లు |
| ఎగుమతి చేసే దేశాలు | అమెరికా, యూకే |
| ఏటా తయారయ్యే దుస్తులు(పీస్‌లు) | 70 లక్షలు |
| షెడ్ల విస్తీర్ణం | 7 ఎకరాలు |
| షెడ్ల నిర్మాణానికి వ్యయం | రూ.60 కోట్లు |
| పరిశ్రమలోని కుట్టుమిషన్ల సంఖ్య | 1,000 |
| ఉపాధి పొందనున్న మహిళలు | 1,600 మంది |
| మూడేండ్లలో లభించే ఉద్యోగాలు | 2,000 |

### గోకుల్‌దాస్ పరిశ్రమ ముఖ్యాంశాలు

| | |
|---|---|
| ఏ దేశానికి ఎగుమతి | అమెరికా |
| ఎగుమతి ప్రారంభం | 2023 జూలై |
| ముందుగా ఎగుమతి చేసిన స్టాక్ | 1.17లక్షల బాక్సులు |
| ఉపాధి పొందిన వారి సంఖ్య | 1,500 |

### పెద్దూరులోని అప్పారెల్ పార్క్ స్వరూపం

| | |
|---|---|
| అప్పారెల్ పార్క్ విస్తీర్ణం | 88 ఎకరాలు |
| మౌలిక సదుపాయాల కోసం వ్యయం | రూ.375 కోట్లు |
| పార్క్‌లోని మొత్తం షెడ్లు | 46 |
| మొత్తం పవర్‌లూమ్స్ సామర్థ్యం | 4,416 |
| పూర్తిస్థాయిలో లభించే ఉద్యోగాలు | 25,000 |

### టెక్స్‌పోర్టు కంపెనీ ప్రత్యేకతలు



- 1978 నుంచి రెడీమేడ్ రంగంలో అడుగుపెట్టింది
- నాణ్యమైన ఉత్పత్తులు, ఎగుమతులతో అనుభవం
- ఏటా 17మిలియన్లకు పైగా దుస్తుల ఉత్పత్తి
- దేశవ్యాప్తంగా 19 యూనిట్‌లు కలిగి ఉంది. సిరిసిల్ల యూనిట్‌తో 20కి చేరనున్న యూనిట్‌లు.
- రూ.620 కోట్ల వార్షిక ఆదాయంతో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నది.



ఓసి త్రీ వద్ద ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పరశురాంపల్లి గ్రామస్తులు

# ఉపాధి లేక...ఉపాసముంటున్నం..

- వాతావరణ మార్పులతో వచ్చిన రోగాలతో చచ్చిపోతున్నం
- మీకు దండం పెడతాం.. మాకు న్యాయం చేయండి సార్లు
- నీళ్లులేక అల్లాడుతున్నం
- గ్రామాన్ని త్వరగా తరలించండి
- ఓసి -3 ప్రాజెక్టు ప్రధాన రోడ్డుపై పరశురాంపల్లి గ్రామస్తుల ధర్నా

గణపురం, ఏప్రిల్ 10 : 'కేటీకే ఓసీ-3 నుంచి వచ్చే దుమ్ము, ధూళితో రోగాలతో చస్తున్నం.. వ్యవసాయ భూములను సింగరేణికి అప్పగించడంతో ఉపాధి లేక ఉపాసముంటున్నం' అని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం పరశురాంపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి త్వరగా తరలించి, తమకు పునరావాస ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం కేటీకే ఓసీ-3 ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. మార్చి 10న ఓసీ త్రీ ఎదుట ధర్నా నిర్వహించినప్పుడు సింగరేణి జీఎం రాజేశ్వర్‌రెడ్డి వచ్చి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నెలరోజుల్లో పరిష్కరించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినా, నేటికి పరిష్కారం కాలేదన్నారు. ఎంతో విలువైన పంట పొలాలు తీసుకొని గ్రామాన్ని తరలించకపోవడం వల్ల ఉపాధి లేక పస్తులు ఉంటున్నామని, గ్రామంలో తాగునీరు లేక అల్లాడిపోతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రామాన్ని తరలించే వరకు ధర్నాను విరమించేది లేదని, పురుగుమందు డబ్బాలతో రోడ్డుపై బైఠాయించారు. ఎస్సై రేఖాఅశోక్, భూపాలపల్లి, టేకుమట్ల, రేగొండ ఎస్సైలతో పాటు పోలీసులు ఘటనా స్థలానికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. సింగరేణి జీఎం రాజేశ్వర్ రెడ్డి, అడిషనల్ జీఎం కవీంద్ర, చిట్యాల సీఐ మల్లేశ్‌యాదవ్ గ్రామస్తులతో మాట్లాడి వారం రోజుల్లో సింగరేణి సీఎండీతో మాట్లాడించి సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.



కొలనుపాకలో ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యను నిలదీస్తున్న రైతులు

# చెరువులు నింపాలని నిలదీస్తే..

- రైతుపై నోరుపారేసుకున్న ఆలేరు ఎమ్మెల్యే
- నువ్వే ఉన్నావా అడగడానికి అంటూ బీర్ల ఆక్రోశం
- వాగ్వాదానికి దిగిన రైతులు

ఆలేరు రూరల్, ఏప్రిల్ 10: ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు రైతుల నుంచి నిరసన సెగ తగిలింది. యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాకలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి అయిలయ్య వచ్చారు. ఈ సందర్భంగా అదే గ్రామానికి చెందిన రైతు అంజయ్య.. గ్రామాల్లో చెరువులు నింపి రైతులను ఆదుకోవాలంటూ ఎమ్మెల్యేను నిలదీశారు. దాంతో అయిలయ్య స్పందిస్తూ 'నువ్వే ఉన్నావా అడగడానికి పీకుడుగాడివి' అంటూ దురుసుగా నోరు పారేసుకున్నారు. దాంతో అక్కడున్న రైతులంతా ఇలా మాట్లాడడం సరికాదనడంతో కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. ఆఖరికి ఎమ్మెల్యే సమాధానం చెప్పకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎమ్మెల్యే తమకు క్షమాపణ చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు.

# గుట్టుగా కుడిగట్టు!

మొదటిపేజీ తరువాయి...

కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ)కి తెలంగాణ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ లేఖ రాశారు. వెంటనే లైనింగ్ పనులను నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం.. కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ అనుమతి తర్వాతే కొత్త ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉన్నది. కానీ అందుకు విరుద్ధంగా ఏపీ సర్కారు శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 3 టీఎంసీల నీటిని ఎత్తిపోసే రాయలసీమ ఎత్తిపోతల, 80వేల క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం ఉన్న పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరీ (పీఆర్పీ) విస్తరణకు పూనుకున్నది. రూ. 6,829.15 కోట్లతో పనులను చేపట్టేందుకు 203 జీవోను ఏపీ సర్కారు గతంలోనే జారీ చేసింది. అందులో భాగంగా రాయలసీమ లిఫ్ట్ పనులతోపాటుగా, పీఆర్పీ నుంచి బనకచర్ల క్రాస్ రెగ్యులేటరీ వరకు గల 44వేల క్యూసెక్కుల సామర్థ్యమున్న ఎస్ఆర్ఎంసీ లైనింగ్ పనులు చేపడుతున్నది. రాయలసీమ లిఫ్ట్ పనులపై హరిత ట్రిబ్యునల్ ఇప్పటికే స్టే విధించింది. అయినా ఏపీ తన తీరును మార్చుకోలేదు. కొద్దిరోజులుగా ఎస్ఆర్ఎంసీ లైనింగ్ పనులను ముమ్మరంగా కొనసాగిస్తుండటం గమనార్హం. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ ప్రాజెక్టులకు నష్టం వాటిల్లేలా.. చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఏపీ విస్తరణ పనులు చేపడుతున్నదని తెలంగాణ ఈఎన్సీ అభ్యంతరాలు వ్యక్తంచేశారు.

### జీబీ లింక్ ప్రాజెక్టుపైనా ఫిర్యాదు

గోదావరి బనకచర్ల లింక్ ప్రాజెక్టుపైన కూడా ఇటు జీఆర్ఎంబీకి, పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ)కి, సీడబ్ల్యూసీకి తెలంగాణ సర్కారు మరోసారి ఫిర్యాదు చేసింది. 200 టీఎంసీల గోదావరి వరద జలాలను పెన్నా బేసిన్‌కు తరలించేందుకు ఏపీ సర్కారు ఈ ప్రాజెక్టును చేపడుతున్నది. దీనిపై తెలంగాణ అభ్యంతరాలను వ్యక్తం చేస్తుండటం, మరోవైపు కేవలం ప్రణాళిక దశలోనే ఉన్నదని, డీపీఆర్ సిద్ధం కాలేదని ఇటీవలే ఏపీ బుకాయించడం గమనార్హం. తాజాగా ఇదే ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి నిధుల సమీకరణకు జలహారతి పేరిట ఏపీ ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో తెలంగాణ మరోసారి జీఆర్ఎంబీ, పీపీఏ, సీడబ్ల్యూసీకి ఫిర్యాదు చేస్తూ లేఖ రాసింది. తక్షణం పనులను నిలిపుదల చేయించాలని డిమాండ్ చేసింది.

# కడగండ్లు మిగిల్చిన వడగండ్లు

- వేల ఎకరాల్లో వరి, మక్కజొన్న, మామిడి పంటలకు నష్టం
- మార్కెట్లు, కొనుగోలు కేంద్రాల్లో భారీగా తడిసిన ధాన్యం
- సదాశివపేటలో పిడుగుపాటుకు విద్యార్థి మృతి
- నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి : ఎర్రబెల్లి
- మహబూబాబాద్ జిల్లా మరిపిరాలలో పంటల పరిశీలన

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 10 : రాష్ట్రంలోని పలు జిల్లాల్లో గురువారం కురిసిన వడగండ్ల వాన రైతులకు కడగండ్లను మిగిల్చింది. అకాల వర్షానికి రైతులు వేల ఎకరాల్లో పంట నష్టపోయారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షంతో పలుచోట్ల పంటచేలు నేలవాలాయి. చెట్లు కూలాయి. స్తంభాలు నేలకొరిగాయి. మామిడికాయలు నేలరాలాయి. మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో భారీగా ధాన్యం తడిసింది. పలుచోట్ల పిడుగులు పడ్డాయి. సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాలో వందల ఎకరాల్లో పంటకు నష్టం జరిగింది. ముస్త్యాలలో రైతు కేసిరెడ్డి సురేందర్‌రెడ్డికి చెందిన రూ.లక్షన్నర విలువైన జెర్సీ ఆవు పిడుగుపాటుకు గురై మృతిచెందింది. డోవూర్ గ్రామ శివారులో పిడుగుపడి రైతు బోజిరెడ్డి గేదె మృతి చెందింది. సదాశివపేట పట్టణ పరిధిలోని సిద్ధాపూర్ శివారులో పిడుగుపాటుకు విద్యార్థి సంతోష్ మృతిచెందాడు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వందల ఎకరాల్లో పంట నేలపాలైంది. సిరిసిల్ల మార్కెట్ యార్డులో ఆరు రోజుల కిందట ధాన్యం తెస్తే ఇంత వరకు ఎవరూ పట్టించుకోలేదని రైతు ఎర్రం ఎల్లయ్య ఆవేదన వ్యక్తంచేశాడు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో ఆరబెట్టిన ధాన్యం తడిసింది. వ్యవసాయ మార్కెట్‌కు 1,871 క్వింటాళ్లు విక్రయానికి రాగా, సాయంత్రం కురిసిన వర్షానికి దాదాపు వెయ్యి బస్తాల ధాన్యం తడిసింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మరిపిరాలలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం మరిపిరాలలో వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సిరిసిల్ల బీవైనగర్‌లోని మార్కెట్ యార్డులో తడిసిన ధాన్యాన్ని ఆరబోస్తున్న రైతు